సాక్షి
సిద్దిపేట
మంగళవారం । 23 । సెప్టెంబర్ । 2025



చిన్నకోడూరు: చంద్లాపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

శక్తి స్వరూపిణి.. త్రిపుర సుందరి

వైభవంగా శరన్నవరాత్రులు ప్రారంభం • బాలాత్రిపుర సుందరిదేవీగా అమ్మవారు దర్శనం

దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఆయా మండపాలలో అమ్మవార్లు కొలువుదీరారు. ఉత్సవాల తొలిరోజు అమ్మవారు భక్తులకు బాలా త్రిపుర సుందరిగా దర్శనం ఇచ్చారు. ఉదయం నుంచి మండలపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే జగన్మాత నామంతో శంభుని కొండ మార్మోగింది. అభిషేకాలు, పారాయణాలతో వర్గల్ విద్యాసరస్వతి క్షేత్రం శోభిల్లింది. సరస్వతి అమ్మవారు బాలాత్రిపుర సుందరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నాచగిరి శ్రీక్షేత్రం పీఠాధిపతి శ్రీమధుసూదనానంద సరస్వతి పర్యవేక్షణ, ఆలయ వ్యవస్థాపక చైర్మన్ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది.

– ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/వర్గల్(గజ్వేల్)



బాలాత్రిపుర సుందరిదేవి అలంకరణలో వర్గల్ అమ్మవారు



సిద్దిపేటలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో బాలా త్రిపుర సుందరిగా దివ్యదర్శనం

అటుకుల బతుకమ్మ ఉయ్యాలో..

జిల్లాలో బతుకమ్మ సంబరాలు హోరెత్తాయి. పండుగ పురస్కరించుకుని రెండో రోజు సోమవారం బతుకమ్మలను అందంగా పేర్చి ఆడిపాడారు. అనంతరం నైవేద్యంగా అటుకులను సమర్పించారు. జిల్లా కేంద్రంతోపాటు పలు ప్రాంతాల్లో వర్షం కురవడంతో బతుకమ్మ ఆటపాటలకు అంతరాయం ఏర్పడింది.

– ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/జగదేవ్‌పూర్(గజ్వేల్)/చిన్నకోడూరు(సిద్దిపేట)



జగదేవ్‌పూర్: అలిరాజ్‌పేటలో బతుకమ్మలతో మహిళలు (ఇన్‌సెట్) చెరువులో బతుకమ్మను నిమజ్జనం చేస్తున్న చిన్నారి

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలోని ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా, ఆయాలుగా గౌరవ వేతనంపై విధులు నిర్వహించేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంచినీళ్ల బండ, బొంపల్లి, ఆరెపల్లి, తునికిశాల, సంగీత, నంగునూరు, బంజేరుపల్లి, ఆర్అండ్ ఆర్‌కాలనీ గజ్వేల్ ఆర్అండ్ ఆర్ కాలనీ గజ్వేల్–2లలో ఉపాధ్యాయులుగా, ఆయాలుగా ఖాళీలు ఉన్నాయన్నారు. వీటిలో విధులు నిర్వహించుటకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులకు రూ.8వేలు, ఆయాలకు రూ.6వేలు గౌరవవేతనం అందిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 27లోగా జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి

దుబ్బాక ఆస్పత్రి ఎదుట సీఐటీయూ ధర్నా



ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

దుబ్బాక: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలుచేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి భాస్కర్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక వంద పడకల ఆస్పత్రిలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ హేమ రాజ్‌సింగ్‌కు వినతిపత్రం అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులకు జీవో 60 ప్రకారం వేతనాలు అమలుచేయకుండా కాంట్రాక్టర్ మోసం చేస్తున్నారన్నారు. కార్మికులకు న్యాయపరంగా దక్కాల్సిన వేతనాలతో పాటు సౌకర్యాలు అమలుపర్చాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ దుబ్బాక పట్టణ కన్వీనర్ భాస్కర్, సాజిద్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఈత చెట్లకు పూజలు



పూజలు చేస్తున్న గౌడ సంఘం సభ్యులు

గజ్వేల్‌రూరల్: మండల పరిధిలోని అహ్మదీపూర్‌లో గౌడ సంఘం నాయకులు ఈత చెట్లకు పూజలు చేశారు. సోమవారం ఈత వనంలో ఈదులు గీసేందుకు ఎల్లమ్మ ఆలయంలో పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతియేటా దసరాకు నూతనంగా కల్లు దుకాణాలను ప్రారంభించడం జరుగుతుందని, ఇందులో భాగంగానే ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఏ స్థానం ఎవరికో?



గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల రిజర్వేషన్లు రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ రేకెత్తిస్తున్నాయి. ఏ స్థానం ఎవరికి రిజర్వు చేయాలనే అంశంపై సంబంధిత అధికార యంత్రాంగం కసరత్తు పూర్తి చేస్తోంది. ఆయా స్థానాల రిజర్వేషన్ల జాబితాలను రూపొందించి పంపాలని ఇప్పటికే జిల్లా అధికార యంత్రాంగానికి పంచాయతీరాజ్ కమిషనర్ నుంచి ఆదేశాలు అందాయి. దీంతో సోమవారం కలెక్టరేట్‌లో ఆయా ఆర్డీఓలు, జెడ్పీ సీఈఓ, డీపీఓ, ఎంపీడీఓ, ఎంపీఓలు ఈ ప్రక్రియలో నిమగ్నమయ్యారు. రిజర్వేషన్ల ప్రక్రియ కొలిక్కి వస్తుండటంతో ఆశావహుల్లో ఉత్కంఠ పెరుగుతోంది.

– సాక్షి, సిద్దిపేట

రిజర్వేషన్లపై ఉత్కంఠ!

- జోరందుకున్న 'స్థానిక' సందడి
- జిల్లాలో 508 జీపీలు, 230 ఎంపీటీసీలు, 26 జెడ్పీటీసీలు
- కసరత్తు పూర్తి చేసిన అధికార యంత్రాంగం
- నేడు పంచాయతీ కమిషనర్‌కు రిజర్వేషన్ల జాబితా

జిల్లాలో 26 జెడ్పీటీసీ స్థానాలు, 230 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. అలాగే ఎంపీపీ స్థానాలు 26 ఉన్నాయి. ఈ స్థానాలు ఏ సామాజి కవర్గానికి రిజర్వు చేయాలనే అంశంపై కసరత్తు కొనసాగుతోంది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కుల గణన సర్వే డాటా ఆధారంగా బీసీ రిజర్వేషన్లను ఖరారు చేస్తున్నారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను కేటాయిస్తున్నారు. డాటాను ప్రభుత్వం నుంచే జిల్లాకు పంపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్‌ను అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్న నేపథ్యంలో బీసీలకు దాదాపు పది జెడ్పీటీసీలు, 96 ఎంపీటీసీలు కేటాయించే అవకాశం ఉంది.

బీసీలకు 213 సర్పంచ్ స్థానాలు?

జిల్లాలో 508 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తే 213 గ్రామ పంచాయతీలు బీసీలకు కేటాయించే అవకాశం ఉంది. అయితే ఏ గ్రామ పంచాయతీలు బీసీలకు రిజర్వు అవుతాయి? ఎస్సీ సామాజిక వర్గాలకు రిజర్వు అయ్యే పంచాయతీలు ఏవీ? ఎస్టీలకు కేటాయించే పంచాయతీలు ఏవీ? అనే అంశంపై ఉత్కంఠ ఇంకా కొనసాగుతోంది. మహిళా రిజర్వేషన్ల ఖరారుకు లాటరీ పద్ధతి ద్వారా చేయాలని జిల్లా అధికారులకు ఆదేశాలు అందాయి. ఆయా రాజకీయ పార్టీల సమక్షంలో లాటరీ ప్రక్రియను చేపట్టనున్నారు.

నేడు రిజర్వేషన్ల జాబితా?

ఆయా స్థానిక సంస్థల స్థానాల రిజర్వేషన్లను ఖరారు చేసి.. సంబంధిత జాబితాలను మంగళవారం పంచాయతీరాజ్ శాఖ కమిషనర్‌కు పంపనున్నట్లు సమాచారం. ఈ రిజర్వేషన్లపై ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల సూచనల ప్రకారం ఈ రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ పూర్తి చేస్తున్నారు. వార్డు సభ్యుల రిజర్వేషన్లు ఆయా ఎంపీడీఓలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆర్డీఓలు ఖరారు చేయనున్నారు. జెడ్పీటీసీ, ఎంపీపీల రిజర్వేషన్లు అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జెడ్పీ చైర్మన్ రిజర్వేషన్‌ను పంచాయతీ కమిషనర్ ప్రకటించే అవకాశం ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

సుందరీకరణ వేగిరం చేయండి

- మంత్రి పొన్నం ప్రభాకర్
- ఎల్లమ్మ చెరువు కట్ట పనుల పరిశీలన



ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులు పరిశీలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: ఎల్లమ్మ చెరువు కట్ట సుందరీకరణ పనులు వేగవంతం చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. సోమవారం పట్టణంలోని ఎల్లమ్మ దేవాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ సతీ సమేతంగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. చెరువు కట్ట సుందరీకరణ పనులు, సద్దుల బతుకమ్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ వర్షానికి కట్ట కోతకు గురైన ప్రాంతంలో మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించేందుకు ఎల్లమ్మ చెరువు వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. చెరువు నిండుగా ఉండటంతో కట్ట లోపలికి బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. లైటింగ్, స్టేజీ, సౌండ్ సిస్టమ్, పోలీస్ బందోబస్తు, జాతీయ రహదారి నుంచి ఎల్లమ్మ చెరువు వైపు వెళ్లే రోడ్డులో ట్రాఫిక్ తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే దసరా పండుగ రోజు నిర్వహించే రాంలీలా కార్యక్రమం విజయవంతం కోసం ప్రచారం నిర్వహించాలని మంత్రి సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, ఆర్డీఓ రామూర్తి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, మున్సిపల్ మాజీ వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనిత, అఖిలపక్ష నాయకులు ఉన్నారు.

బతిమిలాడి ఆయిల్‌పామ్ పంట వేయించా..

- ఫ్యాక్టరీని చూస్తుంటే ఆనందభాష్పాలు వస్తున్నాయి
- ఎమ్మెల్యే హరీశ్‌రావు భావోద్వేగం
- నర్మేటలో ఫ్యాక్టరీని సందర్శించిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు



నర్మేట ఫ్యాక్టరీలోని యంత్రాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

నంగునూరు(సిద్దిపేట): 'ఆయిల్‌పామ్ పంటకు నేను జిమ్మేదారిగా ఉంటా అని రైతులను బతిమిలాడి పంటను సాగు చేయించా. లాభాలు గడించిన రైతులను, నిర్మాణం పూర్తయిన ఫ్యాక్టరీని చూస్తుంటే ఆనంద బాష్పాలు వస్తున్నాయి' అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు బావోద్వేగానికి లోనయ్యారు. నంగునూరు మండలం నర్మేటలోని ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని సోమవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్‌హుస్సేన్, ప్రతాప్‌రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్‌తో కలసి హరీశ్‌రావు సందర్శించారు. ఫ్యాక్టరీలో కలియ తిరుగుతూ యంత్రాలను, నీటి స్టోరేజీ ట్యాంక్, విద్యుత్ ఉత్పత్తి యూనిట్ పని తీరు, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో మండుటెండలో చెరువులు, చెక్‌డ్యామ్‌లు మత్తడి దూకడంతో నాటి కరువు ప్రాంతం నేడు సస్యశ్యామలమైందన్నారు.

కేసీఆర్, హరీశ్‌కు ధన్యవాదాలు

చేర్యాల మండలానికి కూతవేటు దూరంగా నర్మేటలో నిర్మించిన ఆయిల్‌ఫామ్ ఫ్యాక్టరీతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరెడ్డి అన్నారు. రైతుబంధు, రైతుబీమా, కరెంటు, విత్తనాలు, ఎరువులు, సాగు నీరందించడంతో పాటు నకిలీ ఎరువులు అమ్మితే పీడీ యాక్ట్ పెట్టడంతో నేడు 140 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండుతోందన్నారు. కేసీఆర్, హరీశ్‌రావు కృషి ఫలితంగా ఈప్రాంతం సస్యశ్యామలమైందన్నారు. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ దుబ్బాక నియోజక వర్గంలో పెద్ద ఎత్తున ఆయిల్‌పామ్ సాగు చేసేలా కృషి చేస్తామన్నారు. దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ కేసీఆర్ ప్రాణంగా ప్రేమించే సిద్దిపేటను హరీశ్‌రావుకు అప్పగించడంతో ఎంతో అభివృద్ధి చేశారన్నారు. యాదవరెడ్డి మాట్లాడుతూ కరువు ప్రాంతంగా ఉన్న సిద్దిపేటను దేశానికే మోడల్‌గా తీర్చిదిద్దిన ఘనత హరీశ్‌కే దక్కిందన్నారు.

జోరు వాన.. జనం హైరానా

కొండపాకలో 85 మి.మీ.వర్షం



జిల్లా కేంద్రంలో కురుస్తున్న వర్షం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/దుబ్బాక: జిల్లాలో సోమవారం జోరుగా వర్షం కురిసింది. దుబ్బాక పట్టణంలో ఏకధాటిగా రెండు గంటల పాటు వర్షం కురవడంతో జనం తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరద నీరు చేరింది. కొండపాకలో 85మిల్లీమీటర్లు, కొమురవెల్లిలో 72 మి.మీ., సిద్దిపేటలో 71.5మి.మీ.వర్షపాతం నమోదు అయ్యింది. అయితే సోమవారం మధ్యాహ్నం నుంచి ప్రారంభమైన వర్షంతో ప్రజలు, వాహనదారులకు తిప్పలు తప్పలేదు.

డీఈ కార్యాలయంపై పిడుగు..

జిల్లా కేంద్రంలోని విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ శాఖ కార్యాలయంపై పిడుగు పడడంతో ప్రమాదం చోటు చేసుకుంది. పిడుగు పడే సమయంలో కార్యాలయంలో ఆరుగురు ఇంజనీర్లు విధులు నిర్వహిస్తున్నారు. పిడుగు పడడంతో విద్యుత్ పరికరాలు, కంప్యూటర్లు ముఖ్యమైన పరికరాలు దెబ్బతిన్నాయి. కొద్దిసేపు విద్యుత్ సరాఫరాకు అంతరాయం ఏర్పడింది. సిబ్బంది మరమ్మతులు చేపట్టి సరాఫరాను పునరుద్ధరించారు. ఈ పిడుగు ప్రమాదంలో సుమారుగా రూ. 10 లక్షల వరకు నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు.

అర్జీల పరిష్కారానికి కృషి

- అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్
- వచ్చిన దరఖాస్తులు 174



అర్జీలు స్వీకరిస్తున్న గరీమా అగర్వాల్

సిద్దిపేటరూరల్: ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన అర్జీలను సత్వరం పరిష్కరించనున్నట్లు అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ తెలిపారు. ఈ మేరకు అధికారులకు దిశానిర్దేశం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్ లో నిర్వహించిన ప్రజావాణిలో గరీమా అగర్వాల్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్జీదారులకు న్యాయం జరిగేలా పని చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో భూ సంబంధిత, హౌసింగ్, పెన్షన్లు వంటి ఇతర అర్జీలు మొత్తం 174 వచ్చాయి. కార్యక్రమంలో డీఆర్ఓ నాగరాజమ్మ, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అద్దె బస్సు.. కస్సు!



సిద్దిపేట ఆర్టీసీ డిపో ఎదుట నిరసన తెలుపుతున్న అద్దె బస్సుల డ్రైవర్లు

నిలిచిన బస్సులు..


- జీతాలు పెంచాలంటూ డ్రైవర్ల నిరసన
- డిపోలకే పరిమితమైన హైర్ బస్సులు
- సిద్దిపేట డిపోలో 53..
- పండుగ వేళ ప్రయాణికుల పాట్లు

సిద్దిపేటకమాన్: సిద్దిపేట ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్లు తమ జీతాలు పెంచాలంటూ విధులు బహిష్కరించి డిపో ఎదుట నిరసన తెలిపారు. దీంతో అద్దె బస్సులన్నీ సోమవారం డిపోకే పరిమితమయ్యాయి. బతుకమ్మ, దసరా పండుగ వేళ ఊరెళ్లేవారికి సరిపడా బస్సులు లేక, సమయానికి రాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి తలెత్తింది.

నిత్యం వేల కిలోమీటర్లు..


సిద్దిపేట ఆర్టీసీ డిపోలో 53 అద్దె బస్సులు ఉన్నాయి. ఈ బస్సులు సిద్దిపేట డిపో నుంచి నిత్యం జేబీఎస్, హన్మకొండ, కామారెడ్డి, వేములవాడ, మెదక్, రామాయంపేట రూట్లలో తిప్పుతారు. ఈ బస్సులు రోజూ 20వేల కిలోమీటర్ల ద్వారా సుమారు 25వేల మంది ప్రయాణికులను తమ గమ్య స్థానాలకు చేరవేస్తుంటారు. అద్దె బస్సు యజమానులు హైర్ బస్సు డ్రైవర్లకు ప్రతి నెలా (15రోజులు డ్యూటీ) రూ.15వేలు వేతనంగా చెల్లిస్తుంటారు. కానీ తమకు వేతనం సరిపోవడం లేదని, తాము ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తమకు మరో రూ.5వేలు వేతనం పెంచాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఉదయం విధులు బహిష్కరించి డ్రైవర్లు నిరసన తెలిపారు. అధికారులు కేవలం ఆర్టీసీ బస్సులను మాత్రమే తిప్పారు. అద్దె బస్సుల్లో రెండు బస్సులను వాటి యజమానులే నడపగా.. మిగిలిన బస్సులు డిపోకే పరిమితమయ్యాయి. దీంతో పలు రూట్లలో సరిపడా బస్సులు లేక, సమయానికి బస్సులు రాకపోవడంతో ప్రయాణికులకు ఎదురుచూపులు తప్పలేదు.

వేతనాలు పెంచాలి



సిద్దిపేట ఆర్టీసీ డిపోలో అద్దె బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్నాను. రోజు విడిచి రోజు విధులు నిర్వహిస్తున్నాను. నెలలో 15రోజులు డ్యూటీ చేస్తాను. ప్రతి బస్సుకు ఇద్దరు డ్రైవర్లు ఉంటారు. వేతనం రూ.15వేలు మాత్రమే చెల్లిస్తారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నాయి. వేతనాలు పెంచి ఆదుకోవాలి. - ప్రశాంత్, అద్దె బస్సు డ్రైవర్

ప్రయాణికులకు ఇబ్బందులు రానివ్వం



హైర్ బస్సు డ్రైవర్లు వేతనాలు పెంచాలని డ్యూటీకి రాలేదు. 53 అద్దె బస్సుల్లో రెండింటిని వాటి యజమానులే (ఓనర్ కమ్ డ్రైవర్) నడుపుతున్నారు. మిగతా బస్సులు నడవట్లేదు. ప్రయాణికులకు ఇబ్బందులు రాకుండా సేవలు అందిస్తున్నాం. హైర్ బస్సు యజమానులు డ్రైవర్లతో మాట్లాడుతున్నారు. త్వరలో విధుల్లో చేరుతారని భావిస్తున్నాం.

- రఘు, సిద్దిపేట డిపో మేనేజర్

యూరియా కోసం అవే బారులు



పీఏసీఎస్ వద్ద క్యూ లైన్‌లో రైతుల నిరీక్షణ..

మిరుదొడ్డి(దుబ్బాక): యూరియా కోసం రైతులకు పాట్లు తప్పడం లేదు. సోమవారం తెల్లవారుజామునుంచే రైతులు పీఏసీఎస్‌తో పాటు, గోదాం వద్ద బారులు తీరారు. గంటల తరబడి పడిగాపులు పడితే తప్ప యూరియా బస్తా దొరకని పరిస్థితులు నెలకొంటున్నాయని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పంట కాలం అదను దాటిపోతుండటంతో యూరియా కొరత వల్ల తీవ్ర నష్టాల పాలయ్యే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం త్వరితగతిన యూరియా అందుబాటులోకి తెచ్చి తమను నష్టాల పాలు కాకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

క్లుప్తంగా

అక్రమ రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యాన్ని చూపుతున్న అధికారులు

టేక్మాల్(మెదక్): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం రాత్రి పట్టుకున్నారు. వివరాలు ఇలా... పుల్కల్ మండలం గొంగ్లూర్ గ్రామానికి చెందిన ఇర్ఫాన్ టాటాఏస్ వాహనంలో 75సంచుల బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నాడు. ఈ క్రమంలో సంగారెడ్డి నుంచి నారాయణఖేడ్ వైపు వెళుతున్న ఆటోను బొడ్మట్‌పల్లి వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఆటోలో సుమారు 30క్వింటాళ్ల బియ్యం ఉన్నాయి. వాహనాన్ని సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎస్‌ఐ రాజేశ్ తెలిపారు. జిల్లా సివిల్ సప్‌లై ఇన్‌స్పెక్టర్ నర్సింలు, ఆర్‌ఐ సాయిశ్రీకాంత్ పాపన్నపేట గోదాంకు తరలించినట్లు పేర్కొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో వస్త్ర దుకాణం దగ్ధం

నర్సాపూర్ : వస్త్ర దుకాణంలో అగ్ని ప్రమాదం జరిగింది. ఎస్‌ఐ లింగం వివరాల ప్రకారం... నర్సాపూర్ చౌరస్తా సమీపంలోని శ్రీ సాయినాథ్ కలెక్షన్ దుకాణంలో సోమవారం తెల్లవారు జామున షార్ట్ సర్క్యూట్‌తో నిప్పంటుకుని పొగ వచ్చింది. గమనించిన భవన యజమాని శ్రీనివాస్‌గౌడ్ షాపు నిర్వాహకుడు సురేశ్‌నాథ్‌కు సమాచారం ఇచ్చాడు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారు. కాగా అగ్ని ప్రమాదంలో సుమారు రెండు లక్షల విలువ చేసే వస్త్రాలు కాలిపోయాయని బాధితుడు తెలిపాడు.

గూగుల్ మ్యాప్‌ను నమ్ముకుని వెళ్తే..

కుంటకట్టపైకి దారి చూపిన వైనం



కుంటకట్టపైకి వెళ్లిన డీసీఎం

చేగుంట(తూప్రాన్): పరిశ్రమకు వెళ్లాల్సిన డీసీఎంను డ్రైవర్ గూగుల్ మ్యాప్‌ను నమ్ముకోగా కుంటకట్ట పైకి తీసుకెళ్లింది. ఈ ఘటన వడియారంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... గ్రామ శివారులోని మహవీర్ పేపర్ పరిశ్రమకు వైజాగ్ నుండి డీసీఎం లోడ్ వచ్చింది. ఆదివారం సాయంత్రం డీసీఎం వడియారం శివారులోకి చేరుకోగా డ్రైవర్ గూగుల్‌మ్యాపు నమ్ముకొని ముందుకు సాగాడు. అంతే రైల్వే ట్రాక్ సమీపంలోని కుంటకట్ట వరకు వెళ్లి ఆగిపోయింది. సోమవారం ఉదయం స్థానికుల సాయంతో జేసీబీ తెప్పించి డీసీఎంను బయటకు తీయించి పరిశ్రమకు దారి చూపించారు.

చర్యలు తీసుకోవాలి

సిద్దిపేటకమాన్: వాట్సాప్ గ్రూప్‌లో భారత ప్రధాన న్యాయమూర్తి సీజేఐ బీఆర్ గవాయ్ ఫొటోను జతపరుస్తూ అతడిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఇద్దరు న్యాయవాదులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ న్యాయవాదులు తెలిపారు. ఈ విషయంపై పోలీసు కమిషనర్ కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనుచిత వ్యాఖ్యలపై విచారణ జరిపి బీఎన్‌ఎస్ చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధాన న్యాయమూర్తి పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ పేర్కొన్నారు.రవిబాబు, బాబురావు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ క్లినిక్ సీజ్



క్లినిక్‌ను సీజ్ చేస్తున్న డీఎంహెచ్‌ఓ సంధ్యారాణి

నారాయణఖేడ్: ఇంజక్షన్ వికటించి బాలుడు మృతికి కారణమైన ఆర్‌ఎంపీ క్లినిక్‌ను జిల్లా వైద్యాధికారి సంధ్యారాణి సోమవారం సీజ్ చేశారు. వివరాలు ఇలా... మనూరు మండలం శెల్గిర గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు యూనుస్ చేసిన వైద్యం వికటించడంతో మూడు రోజుల క్రితం గ్రామానికి చెందిన ప్రశాంత్ (14) మృతి చెందాడు. ఈ ఘటనపై డీఎంహెచ్‌ఓ గ్రామంలో విచారణ నిర్వహించారు. ఎలాంటి అనుమతులు లేకుండా క్లినిక్ నడుపుతున్నట్లు గుర్తించారు. అనుమతులు లేకుండా క్లినిక్‌ను నిర్వహించడం, తమ స్థాయిని మించి వైద్యం చేయడం నేరమని ఆమె తెలిపారు.

నిధుల్లేవ్.. పనుల్లేవ్?

మున్సిపాలిటీల్లో కుంటుపడిన అభివృద్ధి

- వచ్చిన ఆదాయం జీతాలకే సరి
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

మున్సిపాలిటీ	జనాభా	ఇళ్లు	సిబ్బంది	వార్షిక ఆదాయం, నిధులు	ఖర్చులు, వేతనాలు
మెదక్	71,000	12,700	235	రూ.6.3 కోట్లు	రూ.8.39 కోట్లు
రామాయంపేట	18,000	5,500	45	రూ.3 కోట్లు	రూ.2.80 కోట్లు
నర్సాపూర్	25,000	9,404	85	రూ.4.21 కోట్లు	రూ.4.53 కోట్లు
తూప్రాన్	23,000	6,624	76	రూ.2.5 కోట్లు	రూ.2.40 కోట్లు

వనరుల ద్వారా మున్సిపాలిటీలకు రావాల్సిన ఆదాయంపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించడం లేదు. ఉదాసీన వైఖరితో ప్రత్యేక గ్రాంటు నిధులు వస్తే తప్ప ముందుకు సాగని దుస్థితి మెదక్ జిల్లాలోని మున్సిపాలిటీల్లో నెలకొన్నది. కేవలం ప్రత్యేక నిధులు వస్తేనే అభివృద్ధి పనులు.. లేకుంటే అంతే అన్నట్లుగా మారింది. మున్సిపాలిటీల పరిస్థితిపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

తూప్రాన్:

మున్సిపాలిటీలు ప్రత్యేక నిధులపై ఆధారపడి మునుగడ సాగిస్తున్నాయి. అయితే స్థానికంగా వస్తున్న ఆదాయం ఉద్యోగులు, సిబ్బంది జీతభత్యాలకే సరిపోవడం లేదు. ఏ చిన్న అభివృద్ధి పనులు చేపట్టాలన్న పురపాలికల్లో నిధులుండని పరిస్థితి నెలకొంది. అధికారులు పూర్తిస్థాయిలో ఆదాయం పెంపుపై ప్రత్యేక దృష్టి సారించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులపై ఆధారపడాల్సి వస్తుంది. అవి వస్తేనే వార్డుల వారీగా పంపిణీ చేసి సీసీ రోడ్లు, డ్రైనేజీలు, సెంట్రల్ లైటింగ్, విద్యుత్ దీపాలు, డివైడర్లు, జంక్షన్‌లకు కేటాయింపులు చేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే రానున్న 20 ఏళ్లలో కూడా అభివృద్ధికి నోచుకోవడం కష్టమనే భావన నెలకొంది.

మున్సిపాలిటీలకు నిధుల లేమి?

జిల్లాలోని మెదక్, రామాయంపేట, నర్సాపూర్, తూప్రాన్ మున్సిపాలిటీల్లో వస్తున్న ఆదాయం.. చేస్తున్న ఖర్చులకు కూడా సరిపోవడం లేదని స్పష్టం అవుతుంది. కాగా కొన్ని మున్సిపాలిటీల్లో అప్పట్లో పాలక పెద్దలు నిబంధనలకు విరుద్ధంగా వారికి అనుకూలంగా ఉన్న వారిని అవుట్‌సోర్సింగ్ విధానంలో ఉద్యోగులుగా చేర్చారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, శానిటేషన్ కార్మికుల నియామకంపై ఇష్టానుసారంగా వ్యవహరించారని కౌన్సిల్ సమావేశాల్లో చర్చలు జరిగినట్టు తెలిసింది. వారిచేతనే అన్ని పనులను చక్కబెట్టుకుంటుండగా, అసలు ఉద్యోగులు నామమాత్రంగా మిగిలిపోతున్నారని వినికిడి. జనాభా ప్రాతిపదికన పారిశుద్ధ్య కార్మికులు, తాత్కాలిక సిబ్బంది ఉండాలి. కానీ మున్సిపాలిటీల్లో అందుకు విరుద్ధంగా నియమించడంతో ఖజానాకు గండిపడుతుంది.



తూప్రాన్ మున్సిపాలిటీ ముఖ చిత్రం

మున్సిపల్ శాఖ నిబంధనల ప్రకారం 10 వేల మంది జనాభాకు 28 మంది పారిశుద్ధ్య కార్మికులు ఉండాలి. వచ్చే ఆదాయం జీతాలకే సరిపోవటం లేదని, కాలనీలో అభివృద్ధి పనులు ఎలా చేస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు వాపోతున్నారు.

ఆదాయం పెంచేందుకు కార్యాచరణ



ప్రస్తుతం మున్సిపాలిటీ ఆదాయం తక్కువగా ఉంది. వచ్చే ఆదాయం నిర్వహణకు, ఖర్చులకు సరిపోవడం లేదు. ఒకటో తారీకు వస్తే పారిశుద్ధ్య సిబ్బంది, తాత్కాలిక ఉద్యోగులకు జీతాలు ఎలా ఇవ్వాలని ఆలోచన చేస్తున్నాం. ఇతర గ్రాంటులు వస్తేనే అభివృద్ధి పనులు చేపడుతున్నాం. ఆదాయం పెంచుకునేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నాం.

– పాతూరి గణేశ్ రెడ్డి, కమిషనర్, తూప్రాన్ మున్సిపాలిటీ

సీతాఫలం కోసం వెళ్లి..

బావిలో జారిపడి వ్యక్తి మృతి

అల్లాదుర్గం(మెదక్): ప్రమాదవశాత్తు బావిలో జారిపడి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని మాందాపూర్ గ్రామ శివారులో సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ శంకర్ వివరాల ప్రకారం ... మండల పరిధిలోని కోమటికుంట తండాకు చెందిన జయరాం (30) సీతాఫలం పండ్లు తీసుకురావడానికి ఆదివారం ఉదయం అటవీ ప్రాంతానికి వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అటవీ ప్రాంతంలో వెతికినా ఆచూకీ దొరకలేదు. సోమవారం ఉదయం మాందాపూర్ శివారులోని బావిలో గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది.

అనుమానాస్పద స్థితిలో..



వెంకటాచారి

ములుగు(గజ్వేల్): పని మీద ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ములుగు మండల కేంద్రంలో జరిగింది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన డాకోజీ వెంకటాచారి(43) వడ్రంగి పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. అతనికి భార్య వైష్ణవి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అయితే 20 రోజుల క్రితం భార్య పిల్లలతో కలిసి పుట్టింటికీ వెళ్లింది. ఆదివారం కట్టెల వ్యాపారానికి వెళుతున్నట్లు ఇంట్లో తల్లికి చెప్పి వెళ్లిన వెంకటాచారి రాత్రైనా ఇంటికి రాలేదు. సోమవారం ఉదయం ములుగులో గల అతిథి గృహం మెట్లపై వెంకటాచారి మృతి చెంది ఉన్నాడు. పోలీసులు అనుమానాస్పద కేసుగా నమోదు చేశారు.

వరదలో కొట్టుకుపోయి వ్యక్తి..



కృష్ణ

రాయికోడ్(అందోల్): వరద నీటిలో కొట్టుకుపోయి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని కుసునూర్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఎస్‌ఐ చైతన్య కిరణ్ కథనం మేరకు... గ్రామానికి చెందిన ఎం.కృష్ణ(44) ఆదివారం ఎక్సల్‌పై చిమ్నాపూర్‌కు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నాడు. గ్రామ సమీపంలోని గుర్మిళ వాగుపై ఉన్న వంతెనపై ఉన్న గుంతలను తప్పించే క్రమంలో అదుపు తప్పి వాగులోని వరద నీటిలో పడి కొట్టుకుపోయాడు. పోలీసులు, గ్రామస్తులు అతడి ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేదు. సోమవారం పోలీసులు, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు గాలించగా వందూరు మాడ వాగు వద్ద మృతదేహం లభ్యమైంది. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు.

గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు: డీఎంహెచ్ఓ



సిద్దిపేటకమాన్: గర్భిణులకు 108 అత్యవసర, 102 అమ్మ ఒడి సేవలు అందించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ధనరాజ్ అధికారులకు సూచించారు. వాహనాల ద్వారా బాధితులను త్వరితగతిన ఆస్పత్రులకు తరలించాలన్నారు. జీవీకే ఈఎమ్ఆర్ఐ ఆధ్వర్యంలో అందుతున్న సేవలపై వైద్యాధికారులతో డీఎంహెచ్ఓ తన కార్యాలయంలో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులకు 102 ద్వారా మాతా శిశుసంరక్షణ సేవలే లక్ష్యంగా సేవలందించాలన్నారు. సమావేశంలో జాన్‌షాహిద్, హరిరామ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతికి ప్రతీక బతుకమ్మ



పూలవనం వీడియోను ఆవిష్కరిస్తున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయానికి ప్రతిబింబం బతుకమ్మ పండుగా అని డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బెజ్జంకి మండల ప్రాథమిక పాఠశాల గుండారం పాఠశాల విద్యార్థులు తెలంగాణ పూలవనం పాటపై నృత్యం చేసిన వీడియోను సోమవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పూలవనం గేయ రచయిత ఉండ్రాళ్ళ రాజేశం మరిన్ని రచనలు చేసి సమాజానికి అందించాలన్నారు. కార్యక్రమంలో బెజ్జంకి మండల విద్యాధికారి మహతీలక్ష్మి, గుండారం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కవులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ



వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ నరేందర్‌గౌడ్

చేగుంట(తూప్రాన్): మండలంలోని పొలంపల్లి గ్రామంలో సోమవారం తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ అట్రాసిటీ కేసుపై విచారణ నిర్వహించారు. ఇటీవల పంచాయతీ కార్యదర్శి స్రవంతి దళిత మహిళను వేధించడంతో మృతి చెందినట్లు మృతురాలి భర్త పోలీసులకు తెలిపాడు. తన భార్యను దూషించి అవమానించడంతోనే లక్ష్మి ఆత్మహత్య చేసుకున్నట్లు అట్రాసిటీ కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయంలో డీఎస్పీ నరేందర్‌గౌడ్ గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబీకులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గ్రామస్తులను సైతం అడిగి వివరాలు సేకరించారు. అనంతరం లక్ష్మి ఆత్మహత్యకు పాల్పడిన చెరువును డీఎస్పీ సందర్శించారు. విచారణలో ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి, దళిత సంఘాల నాయకులు కొండి స్వామి, లక్ష్మణ్, మల్లేశ్, రాజు, దుర్గయ్య, స్వామి, రమేశ్, బాల్‌రాజ్‌గౌడ్, నర్సింలు పాల్గొన్నారు.

భర్త ఇంటి ముందు భార్య ధర్నా

- రెండో పెళ్లి చేసుకున్న భర్త
- న్యాయం చేయాలని బాధితురాలి ఆవేదన



కుమారునితో కలిసి భర్త ఇంటి ముందు ధర్నా చేస్తున్న సుప్రియ

మద్దూరు(హుస్నాబాద్): భార్య ఉండగానే భర్త మరో పెండ్లి చేసుకోవడంతో మొదటి భార్య న్యాయం చేయాలని అత్తింటి ఎదుట ధర్నా చేసింది. ఈ ఘటన దూళ్మిట్ట మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... జనగామ జిల్లా నెల్లుట గ్రామానికి చెందిన సుప్రియకు 2018లో దూళ్మిట్టకు చెందిన నాచగొని వెంకటేశ్‌తో వివాహం జరిగింది. వీరికి 2019లో కుమారుడు వివేక్ జన్మించాడు. కాగా భార్యాభర్తల మధ్య గొడవలు జరగడంతో సుప్రియ భర్తతో పాటు అత్తామామలపై గృహహింస కేసు పెట్టింది. కాగా 2022లో సుప్రియ కోర్టును ఆశ్రయించినా న్యాయం జరగలేదు. దీంతో అప్పటి నుంచి భార్యాభర్తలు వేర్వేరుగా ఉంటున్నారు. 2024లో భర్త వెంకటేశ్ మరో వివాహం చేసుకున్నాడు. దీంతో సుప్రియ తనకు, తన కుమారునికి న్యాయం చేయాలని పెద్ద మనుషులను ఆశ్రయించింది. అయినప్పటికీ న్యాయం జరగకపోవడంతో సోమవారం తన కుమారుడు , కుటుంబ సభ్యులు, బంధువులు, మహిళా సంఘాల సభ్యులతో కలిసి భర్త ఇంటి ఎదుట ధర్నాకు దిగింది. తనకు న్యాయం జరగకపోతే కుమారుడితో కలిసి ఆత్మహత్య చేసుకుంటామని పురుగుల మందు తాగేందుకు యత్నించగా అక్కడే ఉన్న పలువురు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న చేర్యాల సీఐ శ్రీను ఘటనా స్థలానికి చేరుకుని న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

పాఠశాలల్లో అసాంఘిక కార్యకలాపాలు

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని బైరాన్‌పల్లి గ్రామంలోని పాఠశాలల పవిత్రతను కాపాడాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. సోమవారం పలువురు మాట్లాడుతూ గ్రామంలోని ప్రాథమిక ,ఉన్నత పాఠశాలలు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి వేళల్లో కొంత మంది మద్యం తాగి ఖాళీ సీసాలను వదిలి వెళుతున్నారని తెలిపారు. పోలీసులు పెట్రోలింగ్ చేపట్టకపోవడం వల్ల ఆకతాయిలు రెచ్చిపోతున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై తక్షణమే చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

ములుగు ఉద్యాన వర్సిటీ సందర్శన

వీసీతో చర్చించిన ఐవరీ కోస్ట్ అధికారులు



వర్సిటీ వీసీతో ఐవరీ కోస్ట్ అధికారులు

ములుగు(గజ్వేల్): ములుగులోని కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయాన్ని సోమవారం ఐవరీ కోస్ట్ అధికారులు సందర్శించారు. కోస్ట్ విత్తన ఉత్పత్తిదారుల మరియు నర్సరీల సమాఖ్య అధ్యక్షుడు ట్రోర్ మామడన్, అధ్యక్ష, కార్యదర్శులు బ్రాన్ కోఫీ, సెబాస్టియన్, నర్సరీ యజమాని అస్సే కోఫీ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు వీసీ రాజిరెడ్డి, అధికారులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. రైతులకు, పరిశ్రమల వ్యక్తులకు సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, శిక్షణకు సంబంధించి ఒప్పందం కుదుర్చుకోవాలని కోరారు. ఫుడ్ ప్రాసెసింగ్, పరికరాల వినియోగం, కణజాల వర్ధనం, సాంకేతికత ద్వారా మామిడి, కూరగాయలు, పూల, ఔషధ మొక్కలు, కోకో, కాసావా విత్తనాల ఉత్పత్తి చేయడానికి ఈ ఒప్పందం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు భగవాన్, లక్ష్మీనారాయణ, రాజశేఖర్, శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



వాలీబాల్ పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న శ్రావణ్‌కుమార్ రెడ్డి

పీసీసీ ఉపాధ్యక్షుడు శ్రావణ్‌కుమార్‌రెడ్డి

దుబ్బాక : రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తుందని పీసీసీ ఉపాధ్యక్షుడు పన్యాల శ్రావణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం దుబ్బాక మున్సిపల్‌లోని లచ్చపేట మాడల్‌స్కూల్ గ్రౌండ్‌లో పీవీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌లో నియోజకవర్గంలోని 60 జట్లు పాల్గొంటున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి చదువుతో పాటు క్రీడల్లో రాణించేందుకు యువత, విద్యార్థులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. పాఠశాల స్థాయి నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. భవిష్యత్తులో మారుమూల ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించడంతో పాటు వారిని జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు పీవీఆర్ ట్రస్టు కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు చందిరి సంజీవరెడ్డి, అందె రాజిరెడ్డి, గిరిబాబు, వెంకట్ తదితరులు ఉన్నారు.

మల్లికార్జున క్షేత్రంలో మాజీ సీఎం సతీమణి



అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ సీఎం కేసీఆర్ సతీమణి శోభ

కొండపాక(గజ్వేల్): మండలంలోని మర్పడ్గలో గల విజయ దుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో సోమవారం శరన్నవరాత్రి ఉత్సవాలు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. దేవీ ఉపాసకులు హరినాథ శర్మ కలశ స్థాపనతో ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. మాజీ సీఎం కేసీఆర్ సతీమణి శోభ ఉత్సవాలను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మల్లికార్జున స్వామికి అభిషేకం నిర్వహించారు. మొదటి రోజున అమ్మవారు రజత కవచ అలంకరణలో దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రవీందర్, సతీశ్, సత్యం, మల్లికార్జున్, తిరుపతిరెడ్డి, నర్సింహారెడ్డి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ముస్త్యాల వాసికి డాక్టరేట్ పట్టా



భానుచందర్

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని ముస్త్యాల గ్రామానికి చెందిన బంగారు భానుచందర్ డాక్టరేట్ పట్టా పొందారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల తెలుగు విభాగం నుండి రంగనాథ రామాయణం, శ్రీమద్రామాయణ కల్పవృక్షముల తులనాత్మక పరిశీలన అంశంపై డా.పి.వారిజారాణి పర్యవేక్షణలో ఆయన పీహెచ్‌డీ పూర్తి చేసి పట్టా సాధించారు. ఈ మేరకు భానుచందర్ తల్లిదండ్రులు, సోదరుడు, కుటుంబ సభ్యులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు.

గుంతల రోడ్డు.. ప్రయాణం నరకం



చిన్నకోడూరు నుంచి మాచాపూర్ వెళ్లే రోడ్డు దుస్థితి

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల కేంద్రం నుంచి మాచాపూర్ వెళ్లే బీటీ రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో వాహన దారులు ఇబ్బందులు పడుతున్నారు. రెండు గ్రామాల మధ్య ఉన్న బీటీ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చడానికి తవ్వి వదిలేశారు. దీంతో వర్షాలకు గుంతలు ఏర్పడి వాహనదారులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు రోడ్డును పూర్తి చేయాలని కోరుతున్నారు.

భూమి పోతుందనే మనస్తాపంతో రైతు..

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు కారణాలతో ఐదుగురు ఆత్మహత్య చేసుకున్నారు.



సత్యనారాయణగౌడ్

శివ్వంపేట(నర్సాపూర్): తనకున్న భూమి పోతుందని మనస్తాపంతో రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల ప్రకారం... గుండ్లపల్లి గ్రామానికి చెందిన ఉప్పు నూతల సత్యనారాయణగౌడ్(55) యాభై ఏళ్ల నుంచి సాగు చేస్తున్న భూమి వివాదం కొనసాగుతుంది. ఇందుకు సంబంధించి కోర్టులో కేసు నడుస్తుండగా ఖర్చులకు ఇబ్బందులు నెలకొనడం, వివాదం పరిష్కారం కాకపోవడంతో మనస్తాపం చెంది ఆదివారం పొలం వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన తోటి రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో అంబులెన్స్‌లో తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో గాంధీకి తరలించగా అర్ధరాత్రి మృతిచెందాడు.

అప్పుల బాధతో యువకుడు..



గాలి శివప్రసాద్

నర్సాపూర్ రూరల్: యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని తుజాల్‌పూర్‌లో ఆదివారం రాత్రి జరిగింది. ఎస్సై లింగం వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గాలి రమేశ్ చిన్న కుమారుడు శివప్రసాద్ (22) వృత్తిరీత్యా డీజే నిర్వహిస్తున్నాడు. డీజే కొనుగోలు కోసం రెండేళ్ల క్రితం తెలిసిన వారి వద్ద రూ.3 లక్షల 15వేలు అప్పు చేశాడు. సరైన గిరాకీ లేకపోవడంతో తీసుకున్న అప్పు చెల్లించలేక మనస్తాపానికి గురై రాత్రి పొలం వద్ద ఉన్న కోళ్ల ఫారంలో ఉరి వేసుకున్నాడు.

కుటుంబ కలహాలతో..



స్వామి మృతదేహం

దుబ్బాకటౌన్: కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన రాయపోల్ మండలం ఎల్కల్ గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహిపాల్ రెడ్డి వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కుమ్మరి స్వామి(36) వ్యవసాయం చేస్తూ, భార్య, ముగ్గురు పిల్లలతో జీవిస్తున్నాడు. కాగా కుటుంబంలో స్వామికి తరచూ గొడవలు జరుగుతుండేవి. ఆదివారం సైతం గొడవ జరగగా మనస్తాపం చెందిన స్వామి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు.

యాసిడ్ తాగి...

సదాశివపేట(సంగారెడ్డి): యాసిడ్ తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ వెంకటేశం కథనం ప్రకారం... పట్టణానికి చెందిన వికాస్(28) ఆర్థిక ఇబ్బందులు ఎక్కువై తీవ్ర ఒత్తిడికి గురై శనివారం ఉదయం ఇంట్లో టాయిలెట్ క్లీన్ చేసే యాసిడ్ తాగి వాంతులు చేసుకున్నాడు. గమనించిన తండ్రి విశ్వేశ్వర్‌రావు పట్టణంలోని మాతృశ్రీ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు.

వ్యక్తి మృతదేహం లభ్యం



బసహరత్ ఉల్లాఖాన్

పటాన్‌చెరు టౌన్ : చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి మృతదేహం సోమవారం లభ్యమైంది. ఈ ఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ దుర్గయ్య వివరాల ప్రకారం... హఫీజ్‌పేట్ ఆదిత్య నగర్ కాలనీకి చెందిన బసహరత్ ఉల్లాఖాన్ శనివారం నుండి కనిపించకుండా పోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఆదివారం అమీన్‌పూర్ చెరువు గట్టుపై చెప్పులు, సెల్‌ఫోన్ ఉండటంతో గాలింపు చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. సోమవారం ఉదయం అతడి మృతదేహం లభించింది. పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.